ఒసాము సుజుకీతో మాజీ మంత్రి కేటీఆర్ (ఫైల్ ఫొటో)

ఒసాము సుజుకీ కన్నుమూత

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: దిగ్గజ వాహన తయారీ సంస్థ సుజుకీ మోటర్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒసాము సుజుకీ కన్నుమూశారు. గత కొంతకాలంగా లింఫోమా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఈ నెల 25న తుది శ్వాస వీడిచినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఆయన వయస్సు 94 ఏండ్లు. ప్రభుత్వ సంస్థ మారుతి ఉద్యోగ్ లిమిటెడ్‌తో 1981లో ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాతి క్రమంలో మారుతి ఉద్యోగ్ లిమిటెడ్..మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్‌గా మారిపోయింది. ఈ సంస్థ నుంచి కేంద్ర సర్కార్ 2007లో పూర్తిగా వైదొలిగింది. ఈ వాటాను సుజుకీ మోటార్ కార్పొరేషన్ కొనుగోలు చేసినప్పటికీ ఇప్పటికి మారుతి పేరుతోనే విక్రయాలు కొనసాగిస్తున్నది. భారత్-జపాన్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు జరగడంలో కీలక పాత్ర పోషించిన ఒసాముకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా మారుతి సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ మాట్లాడుతూ.. దార్శనికత, దూరదృష్టి, రిస్క్ తీసుకోవడానికి ఎల్లప్పుడూ ముందుండే ఒసాము మృతి ప్రపంచ ఆటోమొబైల్ రంగానికి తీరని లోటని, దేశం పట్ల లోతైన, స్థిరమైన ప్రేమకు ఆయన నిర్వచనమని వ్యాఖ్యానించారు.

ఒసాము మరణం బాధాకరం: కేటీఆర్

సుజుకీ మాజీ చైర్మన్ ఒసాము సుజుకీ మరణం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కొన్నేండ్ల క్రితం ఆయనను కలుసుకున్నానని శుక్రవారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఆయన దయార్ద్రత, మంచి మాటలు తనకు గుర్తుకు వస్తున్నాయని పేర్కొన్నారు.

రూపీ @ 85.80

ఇంట్రాడేలో 53 పైసలు..చివర్లో 21 పైసల పతనం

ముంబై, డిసెంబర్ 27: కరెన్సీ పతనాన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. దీంతో రోజుకొక కనిష్ఠ స్థాయికి పడిపోతున్న విలువ శుక్రవారం ఏకంగా పాతాళంలోకి జారుకున్నది. ఇంట్రాడేలో 85.80 స్థాయికి పడిపోయిన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వుబ్యాంక్ అన్ని అస్త్రాలను సంధించడంతో చివర్లో ఈ భారీ పతనాన్ని తగ్గించుకోగలిగింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు భారీగా పుంజుకోవడం రూపాయి పతనానికి అడ్డుకట్టవేసింది. 85.31 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 53 పైసలు కుంగి చారిత్రక కనిష్ఠ స్థాయి 85.80కి జారుకున్నది. సెంట్రల్ బ్యాంక్ జోక్యంతో భారీ నష్టాల నుంచి కోలుకొని చివరకు 21 పైసల నష్టంతో 85.48 వద్ద ముగిసింది. గడిచిన రెండేండ్లలో ఒకేరోజు ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి. ఫిబ్రవరి 2, 2023న రూపాయి విలువ అత్యధికంగా 68 పైసలు పడిపోయిన విషయం తెలిసిందే.

థర్డ్-పార్టీ యాప్స్‌పై పీపీఐలతో యూపీఐ పేమెంట్స్

ముంబై, డిసెంబర్ 27: థర్డ్-పార్టీ మొబైల్ అప్లికేషన్స్ ద్వారా ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రూమెంట్స్ (పీపీఐ) వినియోగదారులు యూపీఐ లావాదేవీలను జరుపుకొనేందుకు ఆర్బీఐ శుక్రవారం అనుమతిచ్చింది. థర్డ్-పార్టీ యాప్స్ (ఫోన్‌పే వంటివి)ను వినియోగించి పూర్తిస్థాయి కేవైసీ కలిగిన పీపీఐ (స్మార్ట్ కార్డ్స్, గిఫ్ట్ కార్డ్స్, మెట్రో రైల్ కార్డ్స్, ఆన్‌లైన్ అకౌంట్స్, డిజిటల్ వ్యాలెట్స్ వంటివి) హోల్డర్స్ యూపీఐ పేమెంట్స్ చేయడం లేదా స్వీకరించడానికి వీలు కల్పిస్తున్నట్టు సెంట్రల్ బ్యాంక్ ఓ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. ప్రస్తుతం థర్డ్-పార్టీ యాప్స్‌తో తమ బ్యాంక్ ఖాతాలను అనుసంధానం చేసుకొని మాత్రమే యూపీఐ పేమెంట్స్‌ను కస్టమర్లు చేసుకోగలుగుతున్నారు.

సంస్కరణల్లో సింగ్ ఈజ్ కింగ్

దేశం ఆర్థిక సంక్షోభం ముంగిట మోకరిల్లుతున్న రోజులవి.

అత్యవసరాల దిగుమతులకు తప్ప సరిపడా లేని విదేశీ ద్రవ్య నిల్వలతో సతమతమవుతున్న గడ్డు పరిస్థితులు.

అప్పుడే స్వతంత్ర భారతావనికున్న ఆర్థిక సంక్షెళ్లను తన సంస్కరణలతో తెంచిన చాణక్యుడు మన్మోహన్ సింగ్. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించి దేశ ఆర్థిక రూపురేఖల్ని మార్చడంలో మరువలేని పాత్ర పోషించారు.

దేశ ఆర్థిక వ్యవస్థపై మన్మోహన్ సింగ్ తనదైన ముద్ర

అనేక సంస్కరణలతో భారత్‌ను సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి

బ్యాంకింగ్, స్టాక్ మార్కెట్, పారిశ్రామిక రంగాలను వృద్ధిపథంలో నడిపించిన దిట్ట

కొత్త పాలసీలతో ప్రపంచాన్ని ఆకర్షించిన అపర చాణక్యుడు



- *1972-76లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారు*
- *1976-80లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోనే కార్యదర్శి*
- *1980-82లో ప్రణాళికా సంఘం సభ్యుడు*
- *1982-85లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్*
- *1985-87లో ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్*
- *1987-90లో సౌత్ కమిషన్ జనరల్ సెక్రటరీ*
- *1990-91లో ప్రధాన మంత్రి ఆర్థిక వ్యవహారాల సలహాదారు*
- *1991-96లో కేంద్ర ఆర్థిక మంత్రి*
- *2004-2014లో భారత ప్రధాన మంత్రి*

1991 బడ్జెట్

బలహీనపడ్డ దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు మన్మోహన్ సింగ్ చేసిన తొలి ప్రయత్నం.. 1991లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్. అనేక సంస్కరణలను, పన్ను విధానాలను ప్రకటించి భారత భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు.

రూపాయి విలువలో మార్పులు

దేశంలో విదేశీ మారకం నిల్వలు అడుగంటిన వేళ రూపాయి విలువను 1991 జూలై 1, 3 తేదీల్లో వ్యూహాత్మకంగా 20 శాతం మేరకు తగ్గించారు. దీనివల్ల డాలర్, ఇతర దేశాల కరెన్సీలు, వీదేశీ ఆస్తులను రూపాయి విలువలోకి మార్చినప్పుడు అవి మరింత విలువైనవిగా మారాయి. ఇది దేశ ఆర్థిక సంక్షోభం ఇంకా ముదరకుండా అడ్డుకట్ట వేసింది. కరెంట్ అకౌంట్‌పై రూపాయిని పూర్తిస్థాయిలో కన్వర్ట్ చేసుకునే వెసులుబాటు లభించింది. రూపాయి విలువను తగ్గించిన నేపథ్యంలో విదేశాల్లో తాను పనిచేసినప్పుడు సంపాదించిన సొమ్ము విలువ అమాంతం పెరిగింది. అయినప్పటికీ అక్కడి బ్యాంకుల్లో ఉన్న ఆ నగదు మొత్తాన్ని భారత్‌కు తెచ్చి పీఎం జాతీయ సహాయ నిధికి విరాళంగా ఇచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు మన్మోహన్ సింగ్.

కొత్త పారిశ్రామిక విధానం

లైసెన్స్ రాజ్‌ను రద్దు చేశారు. అప్పటిదాకా ఉన్న చాలా ట్రేడ్ లైసెన్సులకు గుడ్‌బై చెప్పూ కొత్త పారిశ్రామిక విధాన తీర్మానం చేశారు. దీంతో వ్యాపార, పారిశ్రామిక రంగాలకు స్వేచ్ఛా వాణిజ్యం చేరువైంది. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మార్గం సుగమమైంది. ప్రాధాన్య రంగాల పరిశ్రమల్లో విదేశీ ఈక్విటీని 40 శాతం నుంచి 51 శాతానికి పెంచారు.

ఎంఆర్‌టీపీ చట్టం సవరణ

గుత్తాధిపత్యం, నిర్బంధ వాణిజ్య పద్ధతుల చట్టంలో సవరణలు తెచ్చారు. దీంతో భారీ సంస్థలు తమ విస్తరణ కోసం ముందస్తు అనుమతుల అవసరం లేకుండా పోయింది.

బ్యాంకింగ్ రంగంలో..

కొత్తగా ప్రైవేట్ రంగ బ్యాంకులకు లైసెన్సులిచ్చారు. అలాగే వడ్డీరేట్ల నిర్ణయంలో బ్యాంకులపైనున్న నియంత్రణల్ని ఎత్తేశారు. బ్యాంకులను పబ్లిక్ లిస్టింగ్ చేశారు.

స్టాక్ మార్కెట్లలో..

నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ఏర్పాటైంది. పేపర్‌లెస్ ట్రేడింగ్ మొదలైంది. డిపాజిటరీలను అనుమతించారు. ప్రైవేట్ మ్యూచువల్ ఫండ్స్ వచ్చాయి. మ్యూచువల్ ఫండ్స్‌ల్లోకి ప్రభుత్వ సంస్థల వాటాలు వెళ్లాయి.

విదేశీ సంస్థాగత మదుపరులు

భారతీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టేందుకు తొలిసారి విదేశీ సంస్థాగత మదుపరులు వచ్చింది మన్మోహన్ హయాంలోనే.

సెబీకి మరిన్ని అధికారాలు

క్యాపిటల్ మార్కెట్లను నియంత్రించేందుకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి మరిన్ని అధికారాలు. స్టాక్ మార్కెట్ మోసాలకూ చాలావరకు అడ్డుకట్ట పడింది.

ఆర్థిక క్రమశిక్షణ

ఆర్థిక క్రమశిక్షణపైనా దృష్టి పెట్టారు. 1992-93కుగాను ద్రవ్యలోటును 5 శాతానికి కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎంజీఎన్ఆర్ఈజీఏ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రధానిగా మన్మోహన్ సింగ్ తెచ్చారు. అలాగే సమాచార హక్కు చట్టాన్ని కూడా సింగ్ ప్రభుత్వమే తీసుకొచ్చింది.

ఇదీ సంగతి..

భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పునాదులు పీవీ-మన్మోహన్ హయాంలోనే పడ్డాయన్నది నిర్వివాదాంశం. జాతీయ, అంతర్జాతీయ కారణాలతో సంక్షోభంలోకి జారుకుంటున్న దేశాన్ని.. తిరిగి గాడిలో పెట్టడానికి ఆర్థిక మంత్రిగా కీలక నిర్ణయాలను సింగ్ తీసుకోవాల్సి వచ్చింది. స్వపక్షం నుంచే అనేక విమర్శలొచ్చినా లెక్కచేయకుండా సాహసించారు. అలాంటి టాప్-10 సంస్కరణల్లో..

విధానం రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించారు. పలు వాణిజ్య సంస్కరణల్ని తెచ్చారు.

- **కేపీ గీతాకృష్ణన్**

రెవిన్యూ కార్యదర్శిగా పనిచేశారు. నిబంధనలకు లోబడి అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సాయాన్ని అందిపుచ్చుకోవడం, దేశ ఖజానాను మిగులు ద్రవ్య నిధుల దిశగా నడిపించడంలో ఈయనదే కీలక పాత్ర.

- **దీపక్ నయ్యర్**

ప్రధాని పీవీకి ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. తద్వారా ఆర్థిక మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ నిర్ణయాలకు బలం చేకూర్చారు.

- **ఎస్ వెంకటరమణన్**

ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేస్తూ ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్‌కు ద్రవ్యపరమైన విధానాలతో మద్దతునిచ్చారు.

- **సీ రంగరాజన్**

ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్, గవర్నర్‌గా పనిచేశారు. ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ క్షీణతను తన సాధనాలతో అడ్డుకొన్నారు.

- **మాంటెక్ సింగ్ అహ్లూవాలియా**

వాణిజ్య కార్యదర్శిగా, ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా, ఆర్థిక కార్యదర్శిగా పనిచేశారు. సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

- **ఎస్పీ శుక్లా**

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో కీలక బాధ్యతల్ని నిర్వర్తించిన అనుభవం ఈయన సొంతం. సుంకాలు, వాణిజ్య

మన్మోహన్ సింగ్‌ను ఈ దేశం ఎప్పటికీ మరువదు. సంస్కరణలతో నవ భారత ఆర్థిక వ్యవస్థకు నాంది పలికారు. ***-ఎన్ చంద్రశేఖరన్, టాటా సన్స్ చైర్మన్***

1991లో మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భారత్‌కున్న ఆర్థిక సమస్యల్ని తొలగించేలా చేసింది. ***-గీతా గోపీనాథ్, ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండీ***

మన్మోహన్ సింగ్ ఓ గొప్ప ఆర్థికవేత్త. తన సంస్కరణలతో భారత ఆర్థిక రూపురేఖల్నే మార్చేశారు. ***-రఘురామ్ రాజన్, ఆర్బీ ఐ మాజీ గవర్నర్***

మహిళా కార్యకర్తలను తోసేసిన డీకే

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: సొంత పార్టీ మహిళా కార్యకర్తల పట్ల కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దురుసుగా వ్యవహరించారు. బెలగావిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన మహిళా కార్యకర్తలను శివకుమార్ పక్కకు తోసేయడం వివాదానికి దారితీసింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. డీకే ప్రవర్తనను ప్రతిపక్ష బీజేపీ తప్పుబట్టింది. వీడియోను బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో షేర్ చేస్తూ 'మహిళా సాధికారితపై కాంగ్రెస్ వైఖరి ఇది' అంటూ వ్యాఖ్యానించారు. వారేమన్నా పశువులనుకుంటున్నారా? అలా తోసేస్తున్నారు. నిజంగా సిగ్గుచేటు అని ఆయన విమర్శించారు.

కొరడాతో కొట్టుకున్న అన్నామలై

కోయంబత్తూర్, డిసెంబర్ 27: తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కే అన్నామలై ముందుగా ప్రకటించిన విధంగా కోయంబత్తూర్‌లోని తన స్వగృహంలో కొరడాతో కొట్టుకుని మురుగన్‌కు మొక్కు చెల్లించుకున్నారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడిని నిరసిస్తూ, రాష్ట్రాన్ని పాలించడంలో, శాంతి భద్రతల వైఫల్యంలో డీఎంకే అసమర్థతకు ప్రాయశ్చిత్తంగా కొరడా దెబ్బలు కొట్టుకున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలో చెడు అంతమై పోవాలంటూ ఆరు కొరడా దెబ్బలు కొట్టుకుని మురుగన్‌కు మొక్కు చెల్లించుకుంటానని గురువారమే ఆయన ప్రకటించారు. అందులో భాగంగా శుక్రవారం అన్నామలై ఒంటిపై చొక్కా లేకుండా కొరడాతో కొట్టుకుంటుండగా.. వెనుక ప్లకార్డులు పట్టుకుని నిల్చున్న కార్యకర్తలు 'నీకు సిగ్గులేదా స్టాలిన్?' అని నినాదాలు చేశారు. అన్నామలై చర్యను ఒక పెద్ద ప్రహసనంగా అధికార డీఎంకే కొట్టిపారేసింది. బీజేపీ అధికారంలో ఉన్న మణిపూర్‌లో జరిగిన ఘటనలపై అన్నామలై ఇలా ఎందుకు చేయలేదని ప్రశ్నించింది.

ముంబై పేలుళ్ల కుట్రదారుడు అబ్దుల్ రెహ్మాన్ మక్కీ మృతి

న్యూఢిల్లీ: ముంబై పేలుళ్ల కుట్రదారుడు, లష్కరే తాయిబా డిప్యూటీ చీఫ్ హఫీజ్ అబ్దుల్ రెహ్మాన్ మక్కీ శుక్రవారం పాకిస్థాన్‌లోని లాహోర్‌లో మరణించాడు. రక్తంలో చక్కెర స్థాయి పెరిగిపోవడంతో కొన్ని రోజుల క్రితం లాహోర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరిన మక్కీ.. గుండెపోటు రావడంతో చనిపోయినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2019 మేలో మక్కీనీ అరెస్టు చేసిన పాకిస్థాన్ ప్రభుత్వం అతడిని లాహోర్‌లో గృహ నిర్బంధంలో ఉంచింది. ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నాడని నమోదైన కేసులపై విచారణ జరిపిన పాక్ కోర్టు 2020లో అతడిని దోషిగా తేల్చింది. 2023 జనవరిలో మక్కీకి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి(యూఎన్ఎస్‌సీ) అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. 2008 నవంబర్ 26న ముంబైలో జరిగిన ఉగ్రదాడులలో మక్కీకి ప్రమేయం ఉంది. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చినట్టు మక్కీపై ఆరోపణలు ఉన్నాయి. రెడ్ ఫోర్ట్‌పై 2000 డిసెంబర్ 22న జరిగిన దాడిలో కూడా మక్కీకి సంబంధం ఉంది.

క్యాన్సర్‌కు కొత్త చికిత్స

- **వ్యాధి కణాలను సాధారణ కణాలుగా మార్చే వీలు**
- **ఇతర కణాలకు నష్టం లేకుండా క్యాన్సర్ అంతం**
- **దక్షిణ కొరియా శాస్త్రవేత్తల పరిశోధనలో పురోగతి**



సియోల్, డిసెంబర్ 27: ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి చికిత్సకు సౌత్ కొరియాకు చెందిన శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. క్యాన్సర్ కణాలనే సాధారణ కణాలుగా మార్చి వ్యాధిని అంతం చేయవచ్చని వీరు జరిపిన పరిశోధనలో తేలింది. కొరియా అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(కేఏఐఎస్‌టీ)కు చెందిన శాస్త్రవేత్తలు కొలన్ క్యాన్సర్‌పై పరిశోధన జరిపారు. ఇందుకోసం సాధారణ కణాల అభివృద్ధి కోసం పని చేసే జన్యు వ్యవస్థ డిజిటల్ మాడల్‌ను వినియోగించారు. కొలన్ క్యాన్సర్ కణాల్లో ఉండే ఎంవైబీ, హెచ్‌డీఏసీ2, ఎఫ్ఓఎక్స్ఏ2 అనే అణువులను అణిచివేస్తే ఈ కణాలను సాధారణ కణాలుగా మార్చవచ్చని వీరు గుర్తించారు. సాధారణంగా ఇప్పుడున్న క్యాన్సర్ చికిత్స విధానాల్లో క్యాన్సర్ కణాలను అంతం చేయడం ద్వారా వ్యాధిని నియంత్రిస్తారు. ఈ చికిత్సలు చేస్తున్నప్పుడు శరీరంలోని ఇతర ఆరోగ్యకరమైన క్యాన్సర్ కణాలు సైతం దెబ్బ తింటాయి. తాము ప్రతిపాదిస్తున్న కొత్త చికిత్స విధానం ద్వారా మాత్రం ఈ దుష్ప్రభావాలు ఉండవని కేఏఐఎస్‌టీ ప్రొఫెసర్ క్వాంగ్ హ్యూన్ చో తెలిపారు. కొలన్ క్యాన్సర్‌లోనే కాకుండా ఇతర క్యాన్సర్‌లలోనూ ఈ విధానం సఫలమయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జుట్టు రంగుతో క్యాన్సర్ ముప్పు!

హెయిర్ డై, స్ట్రెయిటనర్స్‌ను తరచూ వాడితే బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండోక్రిన్‌కు అంతరాయం కలిగించే రసాయనాలు వీటిలో ఉంటాయి. అవి శరీరంలోని హార్మోన్ల కార్యకలాపాలను ప్రభావితం చేస్తాయి. పర్మనెంట్ హెయిర్ డైస్‌లో ఆరోమాటిక్ అమైన్స్, పారాబెన్స్ వంటివాటిని వాడతారు. కెమికల్ స్ట్రెయిటనర్స్‌లో ఫార్మాల్డిహైడ్ వంటివి ఉంటాయి. ఈ రసాయనాలు డీఎన్ఏను దెబ్బతీయగలవు, తద్వారా క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. తలపై ఉండే చర్మం గుండా లోపలికి ఫార్మాల్డిహైడ్ చొచ్చుకుపోగలదు. హెయిర్ స్ట్రెయిలింగ్ కోసం వేడి చేసినపుడు ఇది మరింత బాగా చొచ్చుకుపోతుంది. ప్రముఖ గైనకాలజిస్ట్, అబ్‌స్టెట్రీషియన్ డాక్టర్ మోనిక మాట్లాడుతూ, ఈ రసాయనాలు చర్మం గుండా శరీరంలోకి ప్రవేశించి, శరీరంలోనే వృద్ధి చెందుతాయన్నారు. ఫలితంగా హార్మోన్ అసమతుల్యతలు ఏర్పడతాయని, వక్షోజాల టిష్యూ వృద్ధి ప్రభావితమవుతుందని చెప్పారు. ఈస్ట్రోజన్ లెవెల్స్‌పై కూడా ప్రభావం పడుతుందన్నారు. ఈ ఉత్పత్తులను అప్పుడప్పుడు వాడటం వల్ల ముప్పు ఉండకపోవచ్చునని తెలిపారు.

సూది ఉండదు.. నొప్పి పుట్టదు

- ***షాక్ సిరంజీ తయారుచేసిన ఐఐటీ బాంబే పరిశోధకులు***

ముంబై: వైద్యుడి దగ్గరకు వెళ్తే సూది ఇస్తాడేమో అనే భయం ఇక అక్కర్లేదు. సూది లేకుండా, నొప్పి తెలియకుండా ఇచ్చే పెయిన్‌లెస్ ఇంజెక్షన్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఐఐటీ బాంబేకు చెందిన పరిశోధకులు ఈ షాక్ సిరంజీలను అభివృద్ధి చేశారు. చర్మాన్ని పదునైన సూదితో పొడవాల్సిన అవసరం లేకుండా షాక్‌వేవ్ ఆధారంగా ఈ సిరంజీ పని చేస్తుంది. షాక్ వేవ్‌ల ద్వారా ఒత్తిడిని కల్పించి, వెంట్రుక కన్నా సన్నగా ఉండే మొన(నాజిల్) ద్వారా వేగంగా శరీరంలోకి ఔషధాన్ని పంపించడం ఈ సిరంజీ ప్రత్యేకత. విమానం టేకాఫ్ అయ్యే సమయంలో ప్రయాణించే వేగం కంటే రెట్టింపు వేగంతో, సులభంగా ఇది ఔషధాన్ని శరీరంలోకి చేరుస్తుంది. దీని వల్ల నొప్పి కలగదు. వాపు లాంటి సమస్యలు ఉండవు. అనస్థీషియా, యాంటీఫంగల్, ఇన్సులిన్ అందించేందుకు ఎలుకలపై ఈ సిరంజీని పరీక్షించగా సమర్థంగా పని చేసింది. నాజిల్ మార్చుకుంటే ఒక్కో సిరంజీతో దాదాపు వెయ్యిసార్లు ఇంజెక్షన్లు ఇవ్వొచ్చు.

వైద్య చికిత్సకు ఫేస్ ఏజ్

డాక్టర్లకు ఉపయుక్తంగా ఏఐ టూల్ ● సెల్ఫీతో ఆరోగ్య స్థితిని చెప్పున్న టెక్నాలజీ

న్యూయార్క్: వైద్యరంగంలో కృత్రిమ మేధ అనూహ్య మార్పులను తీసుకొస్తున్నది. ఇప్పటికే వైద్య చికిత్సలు, సర్జరీలకు ఏఐ ఆధారిత రోబోటిక్ వ్యవస్థల వినియోగం పెరుగుతుండగా ఇప్పుడు 'ఫేస్ ఏజ్' టూల్స్ వినియోగం మొదలయ్యింది. ఏఐ ద్వారా పని చేసే ఈ ఫేస్ ఏజ్ టూల్స్.. ఒక్క సెల్ఫీతో మనిషి ఆరోగ్యాన్ని అంచనా వేస్తుంది. పుట్టిన తేదీ ప్రకారం వయసు ఎంత అనేది సంబంధం లేకుండా ఆరోగ్య పరంగా ఎంత వయసు అనేది తేలుస్తుంది. అమెరికా సహా పలు విదేశాల్లో ఈ ఫేస్ ఏజ్ టూల్స్‌ను డాక్టర్లు వినియోగిస్తున్నారు. వీటి వినియోగంపై 'వాల్ స్ట్రీట్ జర్నల్' చేసిన పరిశీలనలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సాధారణంగా ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తి దవాఖానకు వెళ్లినప్పుడు వైద్యులు ముందుగా వయసు అడుగుతారు. వయసును బట్టి చికిత్స అందిస్తారు. అయితే, ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో అసలైన వయసు కంటే బయాలాజికల్ వయసు తక్కువగా ఉంటుందని, అనారోగ్య సమస్యలు ఉన్న వారిలో ఎక్కువ ఉంటుందని వైద్యులు చెప్తున్నారు. పేషెంట్లకు సరైన చికిత్స అందించేందుకు గానూ వారి బయాలాజికల్ ఏజ్ తెలుసుకునేందుకు ఫేస్ ఏజ్ టూల్స్ ఉపయోగపడుతున్నాయని అంటున్నారు. క్యాన్సర్ పేషెంట్లు ఏన్నాళ్లు జీవిస్తారనేది అంచనా వేయడానికి కూడా వైద్యులకు ఈ టూల్స్ ఉపయోగపడుతున్నాయి.

పార్కర్ సోలార్ ప్రోబ్ సురక్షితం

న్యూయార్క్, డిసెంబర్ 27: సూర్యుడి సమీపానికి వెళ్లిన పార్కర్ సోలార్ ప్రోబ్ సురక్షితంగా ఉన్నట్టు నాసా ప్రకటించింది. సూర్యుడికి 60 లక్షల కిలోమీటర్ల సమీపానికి చేరుకున్న ఈ వ్యోమనౌక నుంచి కొన్నిరోజులుగా నాసాకు సమాచారం తెగిపోయింది. అత్యంత వేడి వాతావరణానికి సమీపానికి వెళ్లిన నేపథ్యంలో ఈ వ్యోమనౌక ఆచూకీపై ఆందోళన వ్యక్తమైంది. అయితే, గురువారం అర్ధరాత్రి దీని నుంచి నాసాకు మళ్లీ సిగ్నల్ అందింది. దీంతో వ్యోమనౌక సురక్షితంగా ఉన్నట్టు నాసా ప్రకటించింది. ముందుగా నిర్దేశించిన మేర సూర్యుడి సమీపానికి ఇది చేరుకున్నదని, ఇక ఇదే దూరంతో సూర్యుడి చుట్టూ సంచరించనున్నట్టు వెల్లడించింది. సూర్యుడిపై అధ్యయనం కోసం 2018లో పార్కర్ సోలార్ ప్రోబ్‌ను నాసా ప్రయోగించింది. ఇప్పటివరకు తయారుచేసిన వేగవంతమైన వ్యోమనౌకల్లో ఇది మొదటిది. గంటకు 6.90 లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం దీని సొంతం. సూర్యుడి దగ్గర ఉండే అసాధారణ ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు వీలుగా దీనికి ఒక రక్షణ కవచాన్ని సైతం ఏర్పాటు చేశారు.

వరుసగా రెండో ఏడాదీ 10 లక్షలకు పైగా!

- **భారతీయులకు అమెరికా వీసాలు**

న్యూఢిల్లీ: వరుసగా రెండో సంవత్సరం విజిటర్ వీసాలతోసహా 10 లక్షలకు పైగా నాన్ ఇమిగ్రంట్ వీసాలను అమెరికా భారత్‌కు జారీ చేసింది. 2008/2009 విద్యా సంవత్సరం తర్వాత 2024లో అత్యధిక అంతర్జాతీయ విద్యార్థులను అమెరికాకు పంపించిన ఘనత భారత్ దక్కించుకున్నట్టు భారత్‌లోని అమెరికన్ ఎంబసీ శుక్రవారం ప్రకటించింది. వరుసగా రెండేళ్లు అత్యధిక సంఖ్యలో అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అమెరికాకు పంపిన దేశాలలో భారత్ మొదటి స్థానంలో నిలిచిందని అమెరికన్ మిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. గడచిన నాలుగేళ్లుగా అమెరికాకు అత్యధికంగా భారతీయులు ప్రయాణిస్తున్నారని తెలిపింది. ఈ ఏడాది అమెరికాలో ఉంటూనే హెచ్1-బీ వీసా రెన్యువల్ చేసుకునేందుకు ఒక పైలట్ కార్యక్రమాన్ని విజయవంతంగా తమ విదేశాంగ శాఖ అమలు చేసిందని ఎంబసీ తెలిపింది. దీని వల్ల దేశాన్ని వీడకుండానే తమ వీసాలను రెన్యువల్ చేసుకునే అవకాశం భారతీయ ప్రత్యేక వృత్తి నిపుణులకు లభిస్తుందని పేర్కొన్నది.

గంట నడకతో 6 గంటల ఆయుర్దాయం పెరుగుదల

తాజా అధ్యయనంలో వెల్లడి

*న్యూఢిల్లీ: ఆరోగ్యమే మహా భాగ్యమని, మనం ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం మంచి ఆహారాన్ని తీసుకోవడంతోపాటు తగినంతసేపు వ్యాయామం చేయడం కూడా ముఖ్యమేనని పెద్దలు ఎప్పుడూ చెప్పే మాటే. మనం ఎల్లప్పుడూ ఫిట్‌గా ఉండాలంటే రోజూ అదనంగా ఒక గంటపాటు నడవాలని, దీని వల్ల మన ఆయుర్దాయం మరో 6 గంటలు పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. యాక్టివ్‌గా ఉండే వారి కంటే చురుకుదనం లోపించిన వారికే అదనపు నడక వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ఫిట్నెస్ ట్రాకర్ల ద్వారా సేకరించిన డాటా స్పష్టం చేసినట్టు ఆస్ట్రేలియాలోని గ్రిఫిత్ యూనివర్సిటీ పరిశోధకుల బృందం వెల్లడించింది. యాక్టివ్‌గా ఉండేవారికి అదనపు నడకతో పెద్దగా ఒరిగేదేమీ ఉండదని,